
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు

5★★

గురువారం 20 ఫిబ్రవరి 2025

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయికల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాయికల్ 33 కేవీ లైన్ నిర్వహణ పనుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాయికల్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ రాజేశం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

●మండలంలోని వీరాపూర్ 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటలవరకు ఒడ్డెలింగాపూర్ సెక్షన్ పరిధిలోని సబ్‌స్టేషన్‌లలో విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు జగిత్యాల రూరల్ ఏడీఈ ఆపరేషన్ తెలిపారు. ఒడ్డెలింగాపూర్, ఇటిక్యాల, తాట్లవాయి తదితర గ్రామాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

శివపార్వతుల కల్యాణం

రాయికల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాయికల్-చెర్లకొండాపూర్ గ్రామాల మధ్య పెద్ద చెరువు కట్టపై బుధవారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. వేద మంత్రోచ్చరణల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనం, అభిషేకం, హోమం నిర్వహించారు. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

మంద కృష్ణకు సన్మానం

కథలాపూర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను బుధవారం మండల మాదిగ సంఘ నేతలు హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. సామాజిక నాయకత్వం అంశంలో పద్మశ్రీఅవార్డు దక్కడం హర్షణీయమన్నారు. కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో పర్యటించాలని కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొలిగె శ్రీనివాస్, తెడ్డు శేఖర్, బాలె నీలకంఠం, పొడేటి అర్జున్, గణేశ్, శెనిగారపు గణేశ్, మకిలీ ఇశ్రాయిల్ ఉన్నారు.

నెరవేరిన కల



డీఎస్సీ-2008 అభ్యర్థుల నియామకం ఇలా..

మండలం	అభ్యర్థుల సంఖ్య
బీర్‌పూర్	4
భీమారం	1
బుగ్గారం	1
ధర్మపురి	4
ఎండపల్లి	1
గొల్లపల్లి	1
ఇబ్రహీంపట్నం	2
జగిత్యాల రూరల్	1
కొడిమ్యాల	3
మల్లాపూర్	7
మల్యాల	2
మేడిపల్లి	1
మెట్‌పల్లి	2
పెగడపల్లి	4
రాయికల్	5
సారంగపూర్	1
మొత్తం	40

- ఎట్టకేలకు డీఎస్సీ-2008 అభ్యర్థులకు పోస్టింగ్
- 16 ఏళ్ల నిరీక్షణకు తెర
- జిల్లాలో 40 మందికి నియామక పత్రాలు అందజేత

జగిత్యాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు డీఎస్సీ-2008 అభ్యర్థుల పదహారేళ్ల కల నెరవేరింది. 2008 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ నిర్వహించిన అప్పటి ప్రభుత్వం సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) ఉద్యోగాలను డీఈడీ, బీఈడీ అభ్యర్థులతో భర్తీ చేయాలని సంకల్పించింది. ఇందుకు గానూ డీఈడీ అభ్యర్థులకు 70శాతం, బీఈడీ అభ్యర్థులకు 30 శాతం నిష్పత్తిలో భర్తీ చేసే విధంగా ప్రణాళిక రూపొందించింది. అయితే డీఈడీ చేసిన అభ్యర్థులు ఎస్ జీటీ ఉద్యోగాలు పూర్తిగా మాకే కావాలని డిమాండ్ చేయగా, నాడు వారితోనే ఉద్యోగాలను భర్తీ చేసింది. కాగా అప్పటికే సర్టిఫికేట్ల పరిశీలన పూర్తి చేసుకున్న బీఈడీ అభ్యర్థులు తమకు ఎస్‌జీటీలో అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా కోర్టును ఆశ్రయించి న్యాయ పోరాటానికి గారు. 16 సంవత్సరాల తర్వాత

● కాంట్రాక్ట్ పద్ధతిన...

డీఎస్సీ-2008 బీఈడీ అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రభుత్వం ఎస్‌జీటీ ఉద్యోగాలు కేటాయించింది. గత శనివారం 40 మంది అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి జిల్లా విద్యాశాఖ అధికారి రాము చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. జిల్లాలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి, ఉపాధ్యాయులు లేని పాఠశాలలను ఎంపిక చేసి పోస్టింగ్ కల్పించారు. వారికి కేటాయించిన పాఠశాలల్లో సంబంధిత అభ్యర్థులు విధుల్లో చేరి బోధన చేస్తున్నారు. వీరు ప్రతి నెల రూ.31,040 వేతనంగా పొందనున్నారు.

కోర్టు తీర్పు ఆధారంగా విద్యాశాఖ అధికారులు వారికి కొలువులు ఇవ్వడానికి మూడు నెలల క్రితం సర్టిఫికెట్ల పరిశీలన జరిపారు. అయితే ప్రక్రియ పూర్తయినప్పటికీ ప్రభు త్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో జాప్యం అయింది. దీంతో సదరు అభ్యర్థులు మరోసారి న్యాయ పోరాటం చేశారు. విచారించిన న్యాయస్థానం తీర్పును అమలు చేయాలని ఆదేశించింది. దీంతో విద్యాశాఖ అధికారులు ఆగమేఘాల మీద నియామక ప్రక్రియ చేపట్టారు.

● జిల్లాలో కొలువుదీరిన కొత్త టీచర్లు

జీవితంలో తమకు ఉద్యోగం వస్తుందో రాదోనని ఎదురుచూస్తున్న అభ్యర్థుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు సైతం భర్తీ అయినట్లయింది. కాగా డీఎస్సీ-2008 అభ్యర్థుల్లో కొందరు పోటీ పరీక్షలకు హాజరై ఇతర శాఖల్లో కొలువులు పొందారు. 2024-25 విద్యా సంవత్సరం ముగిసే వరకు ప్రస్తుతం ప్రకటించిన వేతనంపై వీరు సేవలందించాల్సి ఉంటుంది.

మిగతా 8లో

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి
-జిల్లా విద్యాధికారి రాము



వెల్గటూర్‌లో తరగతి గదిని పరిశీలిస్తున్న డీఈవో రాము

వెల్గటూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి రాము నాయక్ అన్నారు. వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలోని వివిధ రికార్డులు పరిశీలించారు. పాఠశాల నిర్వహణ తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అవసరమైతే వేరే చోటుకు డిప్యుటేషన్‌పై పంపిస్తామన్నారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్పెషల్ టెస్ట్ నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బందిని అన్ని పాఠశాలలకు సంబంధించిన రిపోర్టుల గురించి ఆరా తీశారు. విద్యాశాఖకు సంబంధించిన ప్రతి పనిని వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతీ రోజు పాఠశాలలను సందర్శించాలని ఎంఈవో ప్రభాకర్‌కు సూచించారు.

పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామంలో బుధవారం పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలు పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను, ఎమ్మెల్సీని ఆలయ కమిటీ పక్షాన సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ రూరల్ మండల అధ్యక్షుడు జున్నురాజేందర్, స్థానికనాయకులు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి జాతర హుండీ లెక్కింపు
-బ్రహ్మోత్సవాలకు రూ.26.33 లక్షల ఆదాయం



హుండీలను లెక్కిస్తున్న వలంటీర్లు

బీర్‌పూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీర్‌పూర్ శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలకు 26 లక్షల 33వేల రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. బ్రహ్మోత్సవాలలో హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం లెక్కించగా రూ.13,69,163 రాగా మిశ్రమ బంగారం 06గ్రాములు, కిలో 280 గ్రాములు మిశ్రమ వెండి, విదేశీ కరెన్సీ నోట్లు 20 వచ్చినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఎండోమెంట్ జిల్లా పరిశీలకులు రాజమౌళిలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, ఆలయ మాజీ చైర్మన్‌లు స్వామాట్, సుమన్, నాయకులు గుడిసె జితేందర్ యాదవ్, పర్వతం రమేష్, కాసం ఈశ్వరయ్య, అర్చకులు పాల్గొన్నారు.

గణనాథుడికి సహస్ర కలశాభిషేకం

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మి గణపతి మందిరంలో 24వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ లక్ష్మి గణపతి స్వామి మూల మూర్తికి సహస్ర కలశాభిషేకం, పంచామృత అభిషేకం కార్యక్రమాలను ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నంబి వేణు గోపాల్ కౌశిక్, వేద పండితులు తిగుళ్ళ విశ్వనాథశర్మ, ఆలయ అర్చకులు శంకర్‌శర్మలు నిర్వహించారు. కార్యక్రమాలలో మాజీ మున్సిపల్ చైర్మన్ జీఆర్ దేశాయి ఆలయ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై సందీప్

కొడిమ్యాల, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సందీప్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై విద్యా ర్థులకు అవగాహన కల్పిం చారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ళ చేతిలో ఎవరైనా మోసానికి గురైతే వెంటనే 1930నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. షీం టీం, మానవ అక్రమ రవాణా, ఫేక్ సోషల్ మీడియా అకౌంట్ల గురించి కానిస్టేబుళ్లు సౌజన్య, రాజేందర్ అవగాహన కల్పించారు. పోలీస్ కళాబృందం వారు పలు సామాజిక చైతన్య గీతాలను ఆలపించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వేణు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. తిరుపతి, అధ్యాపకులు, పోలీసులు, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న మానిటరింగ్ టీం సభ్యులు

రాయికల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని ఇటిక్యాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సీమలదారి సదాశివ్, మానిటరింగ్ టీమ్ సభ్యులు చెరుకు మహేశ్వర శర్మ, వేముగంటి గిరిధర్‌లు సూచించారు. మండలంలోని తాట్లవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వారు పదవ తరగతి విద్యార్థుల అంతర్గత పరీక్షల ఎఫ్ఏ మార్కులను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వార్షిక పరీక్షల్లో 100శాతం ఫలితాలు సాధించాలన్నారు. ఆ దిశగా విద్యార్థులు ఇష్టపడి చదివాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఏనుగు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు రవీందర్, శ్రీధర్, జగన్, రాజేందర్, హరీష్, శ్రీదేవి, రాజేశం, సుజాత, సీఆర్‌పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జున స్వామి జాతర



పూజలు చేస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ఎండపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలంలోని మారేడుపల్లి గ్రామంలో బుధవారం శ్రీ అంబటి మల్లికార్జున స్వామి జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మహిళలు ఒక్కపొద్దులతో నెత్తిన గంప ఎత్తుకొని ఆలయం వద్దకు వచ్చి బోణం వండుకొని అందరూ కలిసి ఒక్క పొద్దు ఇడవడం ఆలయ ప్రత్యేకత. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఆయనకు ఒగ్గు డోలు కళాకారులు, యాదవ సంఘ సభ్యులు శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన దేవుడిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. ఈసందర్భంగా విప్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం అడిగిన వెంటనే ఎమ్మెల్యే నిధులతో బోర్‌వెల్ వేయించానన్నారు. ఆలయానికి రావడానికి భక్తుల సౌకర్యం కోసం సీసీ రోడ్డు కావాలని వినతి పత్రం అంజేయగా వెంటనే వేయిస్తానన్నారు.సెంట్రల్ లైటింగ్ కూడా ఏర్పాటు చేయి స్తామని విప్ ఈసందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలెందర్ రెడ్డి, గుండాటి గోపిక రెడ్డి, బాలసాని మల్లేశం గౌడ్, అల్లంల సురేష్ ఆవుల తిరుపతి, యాదవ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

కొడిమ్యాల, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన దుబ్బాక చంద్రయ్య(57)అనె వ్యక్తి బుధవారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసు కున్నట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు చంద్రయ్య అనారోగ్యం బాధ భరించ లేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. అనారోగ్యానికి తోడుగా ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో ఇంటిలో దూలానికి మంచం నవారుతో ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని కుమారుడు సాయంత్రం ఇంటికి వచ్చి చూసె సరికి ఉరి వేసుకున్నట్లు పోలీసులకు తెలిపినట్లు ఎస్సై వివరిం చారు. మృతుని కుమారుడు ప్రమోద్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పెగడపల్లి మాజీ సర్పంచ్ మృతి

పెగడపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మాజీ సర్పంచ్ ఒరుగల కొమురెల్లి అనారోగ్యంతో బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కొమురెల్లి మంగళవారం అర్ధరాత్రి శ్వాస తీసుకోవ డంలో ఇబ్బందిపడుతున్నట్లు తెలపగా కుటుంబసభ్యులు అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలి స్తుండగా మృతి చెందాడు. కొమురెల్లి మృతి పట్ల పలువురు మండల రాజకీయ నాయకులు సంతా పం తెలిపారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

8



పోసానిపేటలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆల్‌రౌండర్ అనిల్

● సింగర్‌గా, డైరెక్టర్‌గా, యాక్టర్‌గా, రైటర్‌గా రాణిస్తున్న కథలాపూర్ యువకుడు

6

లింగ నిర్ధారణ నేరం

వెల్గటూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, జెండర్ స్పెషలిస్ట్ గౌతమి హెచ్చరించారు. జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కిషన్‌రావుపేటలో పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ద్వారా మిషన్ శక్తి, మహిళా సాధికారత, సఖి కేంద్రం 181, జిల్లా బాలల పరిరక్షణ విభాగము, మరియు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సైబర్ క్రైం 1930 వివిధ రకాల సేవలను గురించి వాటి ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి స్వరూప, విద్య రాణి, రక్షిత, చంద్రలేఖ, ఆండాళ్, బాలల పరిరక్షక విభాగం కౌన్సిలర్ శ్రీనివాస్, చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ మానస, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

కోరుట్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్‌ను బుధవారం కోరుట్లలోని జువ్వాడి భవన్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణారావు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొంతం రాజం, ఉపాధ్యక్షుడు నయాం, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డిఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

● కలెక్టర్ సత్య ప్రసాద్



దమ్మన్నపేట దగ్గర ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. నిరంతరం నిఘా నిర్వహించాలని ఆయన సూచించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాల యంలో ఇసుక రవాణాపై పోలీసు, మైనింగ్, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణా జరగకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు చెక్ పోస్టుల వద్ద పటిష్ఠ భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాక్టర్లు, లారీలు తదితర వాహనాలను చెక్ చేయాలని, అనుమతి లేని వాహనాలను గుర్తించాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు చేసిన వాగుల ద్వారా మాత్రమే ఇసుక రవాణా జరగాలన్నారు. ప్రతినిత్యం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే అనుమతి పొందిన ఇసుక రవాణా జరగాలన్నారు. ఎక్కువగా అర్ధరాత్రి వేళల్లో అక్రమ ఇసుక రవాణా జరిగే మండలాల్లో కథలాపూర్ మండలం నాగులపేట, మల్లాపూర్ మండలంలోని పలు గ్రామాలుంటున్నాయని, ఆయా ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకొని కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గోదావరి తీరాన ఉన్న ఇబ్రహీంపట్నం, రాయికల్, ధర్మపురి వంటి ప్రాంతాల్లో గోదావరి నుంచి ఇసుకను తీయడానికి అనుమతి లేదన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల ద్వారా మాత్రమే ఇసుక రవాణా జరగాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎస్పీ అశోక్ కుమార్, మెట్‌పల్లి, కోరుట్ల ఆర్‌డీఓలు శ్రీనివాస్, జివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల తనిఖీ

●ధర్మపురి: ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట, ఆరెపల్లి గ్రామాల్లో గల గోదావరి నది ఇసుక రీచ్‌లను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దమ్మన్నపేట గ్రామ శివారులో గల గోదావరి నదిలో స్వయంగా పోలీస్ బృందాలు, రెవెన్యూ, మైనింగ్, రవాణా అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. గోదావరి నది తీరాన అక్రమ ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్లను స్వయంగా ఆయన పట్టుకున్నారు. వెంటనే ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారిని పట్టుకుని వారి నుంచి వివరాలను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఇసుక రీచ్‌ల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలతో రాత్రి వేళల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని ఆయన అన్నారు. పేదలకు ఇసుకను అందుబాటులో ఉండేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అశోక్‌కుమార్, తహసీల్దార్ కృష్ణచైతన్య, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

కెనాల్‌లో పడి సింగరేణి రిటైర్డు కార్మికుడి మృతి

మంథని, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోచమ్మవాడ సమీపంలోని ఎస్‌ఆర్‌ఎస్‌పీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి సింగరేణి రిటైర్డు కార్మికుడు తిప్పనిశంకరయ్య(80) మృతిచెందాడు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కాలనీకి చెందిన శంకరయ్య ఈనెల5న స్వగ్రామమైన ఓదెలకు వెళుతున్నట్లు భార్య మల్లమ్మకు చెప్పి బయలుదేరాడు. ఓదెలకు చేరుకోకపోవడం, ఫోన్ పనిచేయకపోడంతో ఈనెల6న శంకరయ్య కొడుకు తిప్పనిలక్ష్మణ్ నస్పూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం ఉదయం కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు100కు డయల్ చేశారన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళి మృతదేహానికి పరిశీలించారన్నారు. శ్రీరాంపూర్‌లో మిస్సింగ్ కేసు నమోదు కాగా శంకరయ్య బంధువులను మంథనికి పిలిపించగా మృతదేహాన్ని పరిశీలించి శంకరయ్యగా గుర్తించారన్నారని ఎస్‌ఐ రమేష్ తెలిపారు. శంకరయ్య మద్యం సేవించి మతి స్థిమితం లేకుండా తిరుగుతాడని, ఈనేపథ్యంలో మండలంలోని ధర్మారం గ్రామంలో బంధువులు ఉండటంతో ఇక్కడి వచ్చి మద్యం సేవించి ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతుడి కొడుకు లక్ష్మన్ ఫిర్యాదు చేయగా ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

వీణవంక, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంబాల వీరమ్మ(91) చలిమంట కాగుతూ చీరకు మంటలంటుకోగా చికిత్సపొందూ మృతిచెందింది. పోలీసులు వివరాల ప్రకారం.. ఈనెల12వతేదీన ఉదయం ఇంటిముందు చలి మంటకాగుతుంగా ప్రమాదవశాత్తు వీరమ్మ చీరకు నిప్పంటుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

అతిగా మద్యం తాగి యువకుడు..

ధర్మపురి, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని పెద్దనక్కలపేట గ్రామానికి చెందిన బండారి భూమేష్(32) అనే యువకుడు అతిగా మద్యంసేవించి మృతిచెందినట్లు ఎస్‌ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. బండారి లక్ష్మి అనే మహిళకు కొడుకు, ముగ్గురు కూతుళ్ల ఉండగా కొడుకు భూమేష్ అతిగా మద్యం సేవిస్తుంటాడని తెలిపారు. లక్ష్మి బీర్‌పూర్ జాతరకు వెళ్లి బుధవారం వచ్చి చూసేసరికి కొడుకు భూమేష్ మంచంపై చనిపోయి ఉన్నాడని ఆయన పేర్కొన్నాడు. భూమేష్ అతిగా మద్యం సేవించి తిండి సరిగా తినకపోవడం వల్ల మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉరివేసుకుని మాజీ జడ్పీటీసీ ఆత్మహత్య


రాజమల్లు (ఫైల్)

వీణవంక, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ ఆనంద రాజమల్లు(72) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. రాజమల్లు కొంతకాలంగా ఆర్థికఇబ్బందులతో బాధపడుతున్నాడు. బుధవారం ఎవరూలేని సమయంలో ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. 1997లో టీడీపీ తరపున జడ్పీటీసీగా ఎన్నికయ్యారు. మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా కొనసాగారు.

ఉరివేసుకుని యువకుడు..

ఎలిగేడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్ గ్రామానికిచెందిన యాదగిరి చందు(27)అనే యువకుడు బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంబీఏ వరకు చదువుకున్న చందు ఏమి పని చేయకుండ ఇంటివద్దనే రెండేళ్లుగా ఉంటున్నాడు. ఏదైన పని చూసుకొమ్మని తరచుగా తల్లిదండ్రులు చెప్పేవారు. ఈక్రమంలో ఫోన్‌లో పరిచయమైన అమ్మాయిని ఎలా పెళ్లి చేసుకుంటావని మందలించారు. అటు ఉద్యోగంలేక ఇటు అమ్మాయిని పెళ్లి చేసుకోలేక ఖాళీగా ఉంటున్నాననే మనస్థాపంతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బాలిక (మానసిక వికలాంగురాలు)పై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయలు జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.2లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా ప్రధానన్యాయమూర్తి నీలిమ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మల్యాల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓబాలికపై 2021సంవత్సరంలో చెట్‌పెల్లి నారాయణ అలియాస్ టోపి నారాయణ(55) అనేవ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్యాల పోలీసులు నారాయణపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో కేసు విచారణ చేపట్టగా కోర్టు డ్యూటి అధికారులు సరైన సాక్ష్యులను ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణా రావుతో పాటు పోలీస్, కోర్టు డ్యూటీ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

భార్య, ఇద్దరు పిల్లల మృతికి కారణమైన భర్త రిమాండ్

పెగడపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భార్య, ఇద్దరు పిల్లల మృతికి కారణమైన మద్దులపల్లి గ్రామానికిచెందిన కంబాల తిరుపతిని బుధవారం పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెగడపల్లి మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన కంబాల తిరుపతి వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తన భార్య హారికను వేధింపులకు గురి చేశాడు. దీంతో హారిక పిల్లలకు పురుగుల మందు ఇచ్చి ఆమె కూడా తాగి మృతి చెందింది. ముగ్గురి మృతికి కారణమైన తిరుపతిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సీహెచ్ రవికిరణ్ తెలిపారు.

సెల్‌ఫోన్ హ్యాక్‌పై సైబర్‌క్రైంకు ఫిర్యాదు

మంథని, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నఓదాల గ్రామానికి చెందిన చిట్టవేన హరీష్ సెల్‌ఫోన్ హ్యాక్ కాగా మంథని పోలీసులతో పాటు సైబర్ క్రైం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. మంథనికి వచ్చిన అతనుఫోన్‌లో వాట్సాప్ ఓపెన్ చేయడంతో చాలా మందికి అతడి వాట్సప్ ద్వారా అశ్లీల చిత్రాలు వెళ్ళాయి. వారు ఫోన్‌చేసి ఈవిషయాన్ని చెప్పడంతో తన ఫోన్ హ్యాక్ అయినట్లు ఆందోళనకు గురై పోలీసుస్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేశాడు. వారి సూచనమేరకు సైబర్ క్రైం 1930 నెంబర్ ద్వారా ఫిర్యాదు చేసి తన సిమ్ బ్లాక్ చేసినట్లు తెలిపారు.

దొంగల పట్టివేత

ధర్మపురి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో చిల్లర సామాన్లు దొంగతనం చేసిన ఐదురుగు మహిళలను స్థానికులు బుధవారం పట్టుకున్నారు. చొప్పదండి మండలానికి చెందిన ఐదుగురు మహిళలు గ్రామాల్లో చెత్త సామాన్లు, కాగితాలు సేకరించి బయట విక్రయిస్తుంటారు. అదే సమయంలో తిమ్మాపూర్ గ్రామంలోని పలు ఇళ్లలో చొరబడి స్టీల్, ఇత్తడి బిందెలు, ప్లేట్స్, చెంబులు, గ్లాసులు దొంగిలించారు. వెంటనే గ్రామస్థులు సదరు మహిళలను పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

ఆల్‌రౌండర్ అనిల్

సింగర్‌గా, డైరెక్టర్‌గా, యాక్టర్‌గా, రైటర్‌గా రాణిస్తున్న కథలాపూర్ యువకుడు

పదేళ్లుగా యూట్యూబ్‌లో సందడి

60 వేల మంది సబ్‌స్క్రైబర్లు


పాట పాడుతున్న అనిల్ పల్ల

కథలాపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో పరుచుకున్న అందాలు.. గ్రామీణ యువత మనసులోని మధురానుభూతులు..ఆధ్యాత్మిక భావాలను పెంపొందించే పదాలే ఆ యువకుడి కథా వస్తువులు. కథలాపూర్ మండలం దూలూరుకు చెందిన అనిల్ పల్ల అనే యువకుడు సింగర్‌గా, డైరెక్టర్‌గా, యాక్టర్‌గా, రైటర్‌గా రాణిస్తున్నాడు. పదేళ్లుగా అతడి పాటలు యూట్యూబ్‌లో సందడి చేస్తున్నాయి. సమ్మక్క- సారలమ్మ, బతుకమ్మ పండగ ప్రాశస్త్యాన్ని పాటలుగా రాయడమే కాకుండా కెమెరాలో బంధించి 60 వేల మంది సబ్‌స్క్రైబర్లను సంపాదించాడు.



అనిల్ నటించి, దర్శకత్వం వహిస్తున్న ఆల్బం

సీఎస్ క్రియేషన్స్ ఫిల్మ్ ప్రొడక్షన్ ఏర్పాటు

2015లో సీఎస్ క్రియేషన్స్ ఫిల్మ్ ప్రొడక్షన్ సంస్థను స్థాపించిన అనిల్ సొంతంగా పాట రాసి స్వీయ దర్శకత్వంలో వీడియో చిత్రీకరించి రైతు పాట పేరిట మొదటిసారిగా యూట్యూబ్ లో అప్‌లోడ్ చేశాడు. దీంతో అనేక మంది ఆ పాటను అభినందించారు. సుడా సక్కని పిలగా, మనసులో తెరచాటుగా, సినసిన సింతల్లారా, బతుకమ్మ, సమ్మక్క, సారలక్క, వానల్లో వరదల్లో చినుకుల్లో వంటి జానపద పాటలను నటీనటులతో కలిసి వీడియోలు రూపొందించాడు. పల్లెటూరు యువతలో దాగి ఉన్న కళను బయటకు తీసే ప్రయత్నం చేశాడు.

భజరంగ్ మూవీ మేకర్స్‌తో సినిమాలు

వీడియో పాటలకు వెల్లువలా వస్తు న్న కామెంట్లతో తన ప్రతిభకు మరింత పదును పెట్టాలనే యోచనతో భజరంగ్ మూవీ మేకర్స్ పేరిట సినిమాలు తీయాలని సంకల్పించాడు. అరాచకం, మరిచి పోతున్న కన్నయ్యా అనే సినిమాలు పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉన్నాయి.

బాల్యం నుంచి పాటలంటే ఇష్టం

అనిల్ పల్ల, కళాకారుడు

పల్లె ప్రజల జీవన శైలి నేపథ్యంతోనే పాటలు రాయాలని చిన్ననాటి నుంచి ఆసక్తి ఉండేది. బీమారం మండలం ఈదుల లింగంపేట పాఠశాలలో చదువుకునే రోజుల్లో నేను పాడిన పాట విని గురువులు అభినందించారు. జిల్లాస్థాయి పాటల పోటీల్లో గెలుపొంది వేములవాడలోని సినారే కళాభవన్‌లో సినారే చేతుల మీదుగా బహుమతి పొందడం నాలో మరింత ఆసక్తిని పెంచింది. ప్రస్తుతం కథలాపూర్‌లో స్టూడియో ఏర్పాటు చేసుకొని పాటలు రాస్తూ, గానం చేస్తూ, దర్శకత్వం, డబ్బింగ్, కాస్ట్యూమ్, ఎడిటింగ్ వంటి పనులన్నీ చేసుకుంటున్నా. యూట్యూబ్‌లో 60 వేల మంది సబ్‌స్క్రైబర్లు ఉండడం చాలా సంతోషంగా ఉంది.

మైసమ్మ ఆలయంలో చోరీ..

ముస్తాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) :ముస్తాబాద్ మండలకేంద్రంలోని పులి శేరుకుంట కట్టపైగల మైసమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి జరిగిందని ఆలయ కమిటీచైర్మన్ బద్దిపడిగె ప్రతాపరెడ్డి తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన రూ12 వేలవిలువచేసే గంటతో పాటు హుండీలోని డబ్బులను దొంగలు దొంగిలించారన్నారు. గతంలో సైతం ఇలాగే చోరీ జరిగిందని వాపోయారు. స్థానిక పోలీసుకు ఫిర్యాదు చేస్తున్నట్లు ప్రతాపరెడ్డి, పుల్లూరి రవిలు వివరించారు.

పేకాట కేంద్రంపై పోలీసుల దాడి

ఓదెల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారు హరిపురం రోడ్డు వైపు బుధవారం పోలీసులు పేకాటకేంద్రంపై దాడిచేశారు. ఎస్సై రమేష్ మాట్లాడుతూ ఓదెలకు చెందిన కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లిదాడి చేశామని తెలిపారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.రూ.7,100, మూడు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పేకాటలు, కోడిపందేలు, బెట్టింగులు లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కానిస్టేబుళ్ళు రాజేందర్, ప్రశాంత్, రామకృష్ణ పాల్గొన్నారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- 103 గ్రాములు బంగారం స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగ మిట్టపల్లి లక్ష్మణ్ అలియాస్ రవి అలియాస్ విజయ్‌ని మల్లాపూర్ మండలం ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ వద్ద అరెస్ట్‌చేశారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్ కొద్ది సంవత్సరాలుగా ఉమ్మడికరీంనగర్, నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో తాళం వేసిన ఇళ్లను గుర్తించి బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించేవాడని అన్నారు. నిందితుడిపై 40కేసులు ఉండగా 28కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 12 కేసులలో జైలు శిక్ష విధించిందని పేర్కొన్నారు. గత ఏడాది బెయిల్ మీద వచ్చి మల్లాపూర్ మండలం ముత్యంపేట, సిర్పూర్, మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామలలో చోరీ పాల్పడ్డాడని తెలిపారు. మంగళవారం సాయంత్రం మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామ శివారులోని చక్కెర ఫ్యాక్టరీ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా లక్ష్మణ్ అను మానస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. దీంతో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు నేరం ఒప్పుకోవడంతో అతని వద్ద నుంచి 103 గ్రాములు బంగారం, 125 గ్రాముల వెండి, ఒక బైక్‌స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యం వ్యవహరించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డిని, మల్లాపూర్ ఎస్‌ఐ రాజులు, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ రాములు అభినందించారు.

వృత్తి కూలి పని.. ప్రవృత్తి గంజాయి సాగు

- సిరిసిల్ల మెడికల్ కళాశాల నిర్మాణ ప్రదేశంలో గంజాయి మొక్కల పెంపకం
- ఒడిశా, పశ్చిమ బెంగాల్ వలస కూలీల గుట్టురట్టు చేసిన పోలీసులు
- జిల్లా వ్యాప్తంగా ఏడాదిలో 2.2 కిలోల గంజాయి సీజ్.. 48 మంది అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు వలస వచ్చిన ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు పని చేసే ప్రదేశంలోనే గంజాయి సాగు చేశారు. వారిని వారంరోజుల క్రితం పోలీసులు పట్టుకున్నారు. జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేశారు. నార్కోటిక్ జాగిలాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఏడాదిలో గంజాయి అక్రమ రవాణా, సాగుచేస్తున్న, తాగుతున్న 48మందిని అరెస్ట్ చేశారు. వారినుంచి 2.2కిలోల గ్రాముల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు.


వలసకూలీలు సాగు చేసిన గంజాయి మొక్కలు(ఫైల్)

● గంజాయి సాగులో కొత్తకోణం..

గంజాయి సాగులో కొత్త కోణం వెలుగు చూసింది. తమపై ఎవరి దృష్టిపడదని భావించిన వలస కూలీలు సిరిసిల్ల మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు చేస్తూ అక్కడే గంజాయి మొక్కల పెంపకం చేపట్టారు. విషయం తెలుసుకున్న సిరిసిల్ల పోలీసులు ఈ వ్యవహారాన్ని గుట్టురట్టు చేశారు. సిరిసిల్ల పట్టణం బైపాస్ రోడ్డులో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు జరుగు తున్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన దేబ్రట్ ధాలి, మాలే మాలిక్ సెంట్రింగ్ పని చేసు కుంటూ పక్కనే షెడ్డులో ఉంటున్నారు. పక్కనే ఉన్న భూమిలో గంజాయి విత్తనాలు చల్లి మొక్కల పెంపకం చేపట్టారు. పెరిగిన ఆకులను తెంపి ఎండబెట్టి గంజాయిని తయారుచేస్తున్నారు.

● ఆరుగురు కటకటాలపాలు

గంజాయి సాగుచేస్తూ, సేవిస్తున్న ఆరుగురు వలస కూలీలు కటకటాలపాలయ్యారు. ఒడిశాకు చెందిన దేబ్రట్ ధాలి, మాలే మాలిక్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రణబ్ సింహా, సాగర్ సర్కార్, జిబాన్ బిశ్వాస్, రంజీవ్ సింహాను పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు 5.2 లక్షల రూపాయల విలువైన 52గంజాయి మొక్కలను తొలగించి ధ్వంసం చేశారు. ఆరుగురు వలసకూలీలను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపి 50గ్రాముల ఎండిన గంజాయి, రెండు గంజాయి తాగే పైపులను పోలీసులు సీజ్ చేశారు. ఈ విషయం సిరిసిల్లలో చర్చనీయాంశమైంది.



● గంజాయి రవాణాపై ఉక్కుపాదం
- అఖిల్ మహాజన్, ఎస్పీ

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాం. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తూ నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు చేస్తూ గంజాయి అక్రమ రవాణాను అరికడుతున్నాం. గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నవారిపై నిఘా పెట్టి గంజాయి కిట్ల సహాయంతో యూరిన్ టెస్ట్‌లు నిర్వహించి సేవించే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం. గంజాయికి అలవాటు పడిన వారికి డీఅడిక్షన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. గంజాయి విక్రయించినా, సాగు చేసినా, రవాణా చేసినట్లు తెలిస్తే వెంటనే 8712656392 నంబర్‌కు సమాచారం అందిస్తే కఠినచర్యలు తీసుకుంటాం.

దాడికి పాల్పడిన భార్యాభర్తలపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇంటిపక్కన గోడ విషయంలో దాడికిదిగి గాయపరిచిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన భార్యభర్తలు భీమరి రేణ, నర్సింలుపై కేసు నమోదుచేశామని ఎస్సై రమాకాంత్ బుధవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని భీమరి అంజయ్య తన ఇంటిస్థలంలో పక్కనే ఉన్న సోదరుడు నర్సింలు ఇల్లు కనిపించకుండా గోడను నిర్మించాడు. అడ్డుగా ఉన్న గోడను నర్సింలు తొలగించడంతో ఈనెల 18న ఇదేమిటని అంజయ్య ప్రశ్నించాడు. దాంతో కోపోద్రిక్తుడైన నర్సింలు తన ఇంటిలోని కొడవలిని తీసుకొని వచ్చి అంజయ్యపై దాడికి దిగాడు. అడ్డుగా వెళ్లిన అంజయ్య భార్య మనెవ్వ, కొడుకు అభిలాష్‌లను రోకలిబండతో దాడిచేశాడు. ఈ క్రమంలో నర్సింలు, అతని భార్య రేణ అసభ్యపదజాలంతో దూషిస్తూ విచక్షణారహితంగా చితకబాదారు. బాధితుడు అభిలాష్ ఫిర్యాదు మేరకు భార్యాభర్తలు రేణ, నర్సింలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

అసత్య ప్రచారం చేసిన యువకుడిపై..

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అధికారులపై అసత్య ప్రచారంచేసిన కందికట్కూర్ గ్రామానికి చెందిన తాళ్ళపల్లి శశిధర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ వాట్సాప్ గ్రూపులో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, పోలీసు అధికారులతో పరిచయాలు ఉన్నాయంటూ ప్రచారం చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఎవరు తప్పుడు ప్రచారం చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధికారులను కించపరిచే పోస్టులు పెట్టిన ఇద్దరిపై..

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారులను కించపరిచే విధంగా సోషల్‌మీడియా వేదికగా పోస్టులు చేసిన గుండారపు గణేశ్, ఆకుల శ్రీనివాస్‌రెడ్డిలపై బుధవారం కేసులు నమోదు చేశామని సిరిసిల్ల టౌన్‌సీఐ కె కృష్ణ తెలిపారు. వీరితో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా అధికారుల గురించి, వారి వ్యక్తిగత విషయాలకు సంబంధించిన అసభ్యకర పోస్టులు పెడితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు, ఇతరులను కించపరిచే విధంగా, మనోభావాలు దెబ్బతినే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసిన వారిపై, గ్రూప్ అడ్మిన్‌లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు దగ్ధం

మల్లాపూర్, ఫిబ్రవరి, 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టాపూర్‌గ్రామంలోని ఓ మెకానిక్ షెడ్‌లో రెండు బైక్‌లు, పలుసైకిళ్లు దగ్ధమైనట్లు బుధవారం గ్రామ స్థులు తెలిపారు. వారికథనం ప్రకారం గ్రామంలోని మెకానిక్‌షెడ్డు వద్ద మరమ్మతుల నిమిత్తం ఉన్న వాహనాలు, సైకిళ్లు కాలిపోయాన్నారు. ఏదైనాప్రమాదం జరిగిందా లేకఎవరైనా చేశారా అనే అనుమానాలను వ్యక్తం చేశారు.

12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్, ఫిబ్రవరి 19(ఫిబ్రవరి):మండలంలోని మోర్రాయిపల్లెశివారులో 12 క్వింటాళ్లరేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. ముస్తాబాద్‌కు చెందిన ఆనరాశి శేఖర్, గంధ సత్యనారాయణ గ్రామాలలో తిరుగుతూ సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని అధికధరకు డొక్క ప్రవీణ్‌కు అమ్మడానికి నిర్ణయించారన్నారు. మోర్రాయిపల్లె శివారులో నిల్వఉంచిన పీడీఎస్ బియ్యాన్ని ద్విచక్రవాహనంపై తరలిస్తుండగాపట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం స్వాధీనంచేసు కొని కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

శంకరపట్నం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయరహదారిపై బుధవారం రాత్రి లారీ, బైక్ ఢీకొన్నఘటనలో ఓయువకుడు దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన ముద్దమల్ల హరీన్(23) లారీ బైక్ ఢీ కొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ కొత్తపల్లి రవి సంఘటన స్థలానికి చేరుకొని మృతికి సంబంధించి వివరాల సేకరిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

గొల్లపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండల కేంద్రంలోని నల్లగుట్ట సమీపంలోని సర్వే నెం.544లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తవ్వడమే కాకుండా, అడ్డుకోవడానికి వచ్చిన రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కల్గించిన ఒడ్డె రవి అనే వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవిపై కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

లింగంపేటలో 2500 కోళ్లు మృతి

- ఆలస్యంగా వెలుగులోకి


ట్రాక్టర్‌లో మృతి చెందిన కోళ్లు(ఫైల్)

చందుర్తి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంపేటలో అంతుచిక్కని వ్యాధితో 2500 కోళ్ల మృత్యువాత పడ్డాయి. వారం రోజుల క్రితం ఈ సంఘటన జరగగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలో రమేష్‌రావుకు చెందిన పౌల్ట్రీఫామ్‌లో వారంక్రితం మూడు రోజుల్లో 2500 కోళ్ల మృత్యువాతపడ్డాయి. దీంతో వాటిని ట్రాక్టర్‌లో గ్రామానికి దూరంగా తీసుకెళ్లి గోతి తీసి పూడ్చివేశాన ని, కోళ్ల మృతితో నాలుగు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు రమేష్‌రావు వాపోయాడు. కాగా, గురువారం గ్రామాన్ని సందర్శించి శాంపిల్స్ సేకరించనున్నట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి శ్రీధర్ తెలిపారు.

క్రీడారంగంలో నంబర్‌వన్‌గా నిలుపుతాం

● తెలంగాణ ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి



మాట్లాడుతున్న పి మల్లారెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడలను ప్రమోట్ చేసేందుకు ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఏటా స్పోర్ట్స్ ఒలింపియాడ్ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని, క్రీడా రంగంలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్రఒలింపిక్ సంఘం ప్రధానకార్యదర్శి పి మల్లారెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన తెలంగాణ జూడో అసోసియేషన్ సమావేశానికి హాజరయ్యారు. అంతకుముందు విలేకరులతో మాట్లాడారు. ఒలింపిక్ సంఘంలో గుర్తింపు ఉన్న సంఘాలకు మాత్రమే ప్రాతినిధ్యం ఉంటుందని, అక్రమపద్ధతుల్లో ఏర్పడే సంఘాలకు మనుగడ లేదని అన్నారు. ఇటీవల ఒలింపిక్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైందని, ఏర్పాటైన కొద్ది నెలల్లోనే తెలంగాణలో ఎన్నో మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ క్రీడల సందర్భంగా తెలంగాణ అథ్లెట్లకు డీఏ రూ.250 నుంచి రూ.500 పెంచేలా కృషిచేసినట్లు చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు గతంలో వరుసగా రూ.5లక్షలు, రూ.3లక్షలు ఇవ్వగా, ఈ సంవత్సరం నుంచి రూ.10లక్షలు, రూ.7లక్షలు, రూ.5లక్షలు ఇచ్చేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. 2026లో తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు తెలంగాణ ఒలింపిక్ సంఘం కృషి చేసినట్లు చెప్పారు. క్రీడాసంఘాల మధ్య ఏర్పడుతున్న విభేదాలను పరిశీలించనున్నామని, అన్ని క్రీడాసంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు క్రీడలకు 370కోట్ల రూపాయలు కేటాయించడం అభినందనీయమన్నారు.

తెలంగాణలో జూడో క్రీడాభివృద్ధికి కృషి

● శాసనమండలి డిప్యూటీచైర్మన్, తెలంగాణ జూడో సంఘం చైర్మన్ బండ ప్రకాశ్




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర జూడో సంఘం చైర్మన్ బండ ప్రకాశ్

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా జూడో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని శాసనమండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ జూడో అసోసియేషన్ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని హోటల్ మైత్రీలో తెలంగాణ జూడో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో జూడో క్రీడాకారులకు కొదవలేదని, భవిష్యత్‌లో ఒలంపిక్‌స్థాయికి ఎదగాలన్నారు. 38వజాతీయస్థాయి క్రీడల్లో తెలంగాణ జూడోక్రీడకారులు అద్వితీయ ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ప్రతీ ఒక్కరు జూడోలో శిక్షణ తీసుకోవాలన్నారు. తెలంగాణ జూడో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బండ రాజ్‌కుమార్, గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జూడో క్రీడకు సంబంధించి త్వరలోనే అకాడమీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.జూడో అసోసియేషన్ కోశాధికారి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ ఎన్నిక

తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వరంగల్ జిల్లాకు చెందిన బండ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్‌కు చెందిన గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కదారి అనంతరెడ్డి (కరీంనగర్), పబ్బతి బాలరాజు(యాదాద్రి భువనగిరి), బాదినేని రాజేందర్‌రెడ్డి(జగిత్యాల), మాటేటి సంజీవ్‌కుమార్(పెద్దపల్లి), సంయుక్త కార్యదర్శులుగా రాయిరెడ్డి శంకర్‌రెడ్డి(సిద్దిపేట), సిలివేరి మహేందర్(పెద్దపల్లి), తిప్పారపు సత్యనారాయణ (రాజన్న సిరిసిల్ల), చందనగిరి నాగరాజు(వరంగల్), కోశాధికారిగా రాయిరెడ్డి మహేందర్ రెడ్డి(సిద్ధిపేట), కార్యవర్గ సభ్యులుగా ఎ సాయిచరణ్(ఆదిలాబాద్), వైసాయి కిరణ్(నిర్మల్), కెతిరుపతిగౌడ్(రాజన్నసిరిసిల్ల), కెరాకేష్ (ఆసిఫాబాద్), ఎ రమేశ్‌రెడ్డి(మంచిర్యాల), ఎం శ్రీనివాస్(జగిత్యాల) ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో తెలంగాణ జూడో సంఘానికి చైర్మన్‌గా తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి జాయ్ వర్గీస్ కె, తెలంగాణ ఒలంపిక్ సంఘం నుంచి పి.మల్లారెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ నుంచి వి.శ్రీనివాస్ ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు. నూతన కార్యవర్గం నాలుగేళ్లపాటు పనిచేస్తుందని ఎన్నికల అధికారి ఎస్.పరమేశ్వర్ ప్రకటించారు.

బీజేపీకి సవాల్..



● పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాల్లో గట్టి పోటీ
● కేంద్రమంత్రి సంజయ్ సారథ్యంలో ప్రయత్నాలు
● ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్న బీజేపీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో అధికారం కైవసం చేసుకోవాలని ప్రణాళికా బద్ధంగా వ్యవహరిస్తున్నది. రాష్ట్రంలో జరుగుతున్న కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలు, ఉపాధ్యాయ స్థానం గెలుచుకోవడం ద్వారా రాష్ట్రంలోని విద్యావంతులందరూ బీజేపీ వైపే చూస్తున్నారని సంకేతాలివ్వడానికి తహతహలాడుతోంది. బీజేపీకి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో గెలిచినవారే కావడంతో ఈ రెండు స్థానాలను గెలుచుకోవడం ఆ పార్టీకి అత్యంత అవసరంగా మారింది. ఈ ప్రాంతంలో తమకు ఆదరణ ఉందని నిరూపించుకోవడానికి ఈ ఎన్నికల విజయం దోహదపడుతుందని భావిస్తున్నారు. లేకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో దీని ప్రభావం ఉంటుందని ఆ పార్టీ భావిస్తున్నది. ఈ కారణంగా ఈ పట్టభద్రుల, ఉపాధ్యాయ స్థానాలలో గెలుపును సవాల్‌గా తీసుకుంటున్నది.

50 మంది ఓటర్లుకు ఒక బాధ్యుడు



కాంగ్రెస్‌పార్టీ కంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ ప్రచారంలో కొంత వెనుకబడినా ఇప్పుడిప్పుడే క్షేత్ర స్థాయిలో ప్రత్యేక కార్యాచరణతో కదులుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో చిన్న మైల్ అంజిరెడ్డిని, ఉపాధ్యాయ స్థానంలో మల్క కొమురయ్యను అభ్యర్థులుగా రంగంలోకి దింపింది. కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీలు ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, గోడెం నగేశ్, ఎమ్మెల్యేలు వెంకట రమణారెడ్డి, ధన్‌పాల్‌సింగ్, రాకేశ్‌రెడ్డి, రామారావు పటేల్, మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, డాక్టర్ హరీష్‌తో పాటు ముఖ్యనాయకులను, క్రియాశీలంగా వ్యవహరించే నేతలకు గెలుపు బాధ్యతలను అప్పగించింది. ఇప్పటికే ఆ పార్టీ శ్రేణులు నియోజకవర్గ పరిధిలో ఉన్న పట్టభద్రుల స్థానంలో, ఉపాధ్యాయ స్థానంలో ఉన్న ఓటర్లను బూత్ స్థాయిలో గుర్తించి వారి ఫోన్ నెంబర్లతో సహా వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. 25 నుంచి 50 మంది ఓటర్లకు ఒక బాధ్యుడిని నియమించి అతని ద్వారానే ఓటు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. పార్టీ ప్రచార బాధ్యతను ఓటరును సానుకూల పరిచి పోలింగ్ బూత్‌కు తీసుకువచ్చి ఓటు వేయించే బాధ్యతను ఆయా గ్రామ శ్రేణులకు అప్పగించారు.

ఆత్మీయ సమ్మేళనాలు, సోషల్ మీడియా వారియర్స్ సమావేశాలు



అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాలు, సోషల్ మీడియా వారియర్స్ సమావేశాలు నిర్వహించి అనుసరించవలసిన విధానాలను వివరించారు. మండల స్థాయిలో ఓటర్ల సమావే శాలు కూడా ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నట్లు సమా చారం. కాంగ్రెస్ పార్టీ కూడా ఓటర్లను కలువడానికి ఇదే విధానాలను అవలం బిస్తుండడంతో పోటాపోటీ వాతావరణం నెలకొంటు న్నది. కేంద్రమంత్రితోపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశిస్తున్న నేతలు ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఇక్కడి గెలుపు వారందరికి సవాల్‌గా మారింది.

ప్రచారానికి దూరంగా సీనియర్లు

కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహతోపాటు 23 మంది ఎమ్మెల్యేలు కూడా పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి విజయం కోసం కృషిచేస్తున్నారు. దీంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మక పోటీ సాగుతున్నదనే చర్చ జరుగుతున్నది. 2019లో జరిగిన ఎన్నికల్లో పట్టభద్రుల స్థానంలో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి సుగుణాకర్‌రావుకు 15,077 ఓట్లు పోలయ్యాయి. ఆయన అప్పుడు మూడో స్థానంలో ఉండగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి 56,698 ఓట్లు సాధించి గెలుపొందారు. ఇప్పుడు ఆశావహులు పోటాపోటీగా ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టిన ఫలితంగా 3,55,159 మంది పట్టభద్రులు ఓటర్లుగా ఉన్నారు. 27,088 మంది ఉపాధ్యాయ ఓటర్లుగా ఉన్నారు.

ఇక్కడి నుంచి బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేయడానికి కరీంనగర్‌కు చెందిన కిసాన్ మోర్చా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి పి సుగుణాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, మంచిర్యాలకు చెందిన రఘునాథ్‌రావు ప్రయత్నాలు చేశారు. పార్టీ పట్టభద్రుల అభ్యర్థిగా అంజిరెడ్డిని తెరపైకి తెచ్చింది. సుగుణాకర్‌రావు, రామకృష్ణారెడ్డి ఇప్పటి వరకు ఎక్కడా పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ప్రచారంలో కనిపించడం లేదు. వారు అభ్యర్థి ఎంపిక విషయంలో అసంతృప్తితో ఉన్నారని ప్రచారం జరుగుతున్నది. కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ అభ్యర్థి గెలుపు బాధ్యతను తీసుకోవడం, పార్టీకి అనుబంధంగా ఉండే పలు విభాగాలు, సంస్థలు అంకిత భావంతో పనిచేసేతత్వంగల నాయకులు, కార్యకర్తలు ఉండడం పార్టీ ఆలోచనపరులు వేరే వారికి ఓటు వేసే అవకాశం లేక పోవడం పార్టీ అభ్యర్థికి కలిసివచ్చే అంశాలుగా నిలుస్తున్నాయి. ఉపాధ్యాయ స్థానంలో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య ఒక్కరే రాజకీయ అభ్యర్థి కావడం గమనార్హం. మిగతావారంతా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పోటీలో ఉన్నారు. ఈరెండు స్థానాలను పక్కాగా సాధించుకుంటామనే ధీమాతో బీజేపీ వ్యవహరిస్తుండగా, అధికార కాంగ్రెస్‌పార్టీ కూడా అంతే ధీమాను ప్రదర్శిస్తుండడం ఆసక్తికరంగా మారింది.

కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యను కాషాయీకరణ, ప్రైవేటీకరణ చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను విద్యార్థులు తిప్పికొట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మికభవనంలో ఏఐఎస్ఎఫ్ జిల్లాస్థాయి సర్వసభ్య సమావేశం కుర్ర రాకేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం, యూజీసీ ప్రతిపాదనలతో విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలను విద్యార్థులు తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రబడ్జెట్‌లో ప్రభుత్వం విద్యారంగ హామీల అమలుకు నిధులను కేటాయించాలని అన్నారు. తెలంగాణలో నూతన ప్రభుత్వ ఏర్పడి సంవత్సరం గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఉన్న గురుకులాలకు పక్కా భవనాలు ఏర్పాటు చేయాలని, కేజీబీవీ పాఠశాలలో మౌళిక వసతులు కల్పించాలని పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా నూతన కార్యవర్గంకు ఎన్నికలు జరగాయి. జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్, కార్యదర్శి మంద అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు పెండెల ఆదిత్య, మల్యాల శ్రీజా, పుట్టి సాత్విక్, సహాయ కార్యదర్శులు మల్లమరి జాషావా, పెంట భరత్, కే శ్రీనివాస్, 12 మంది కమిటి సభ్యులను ఎన్నుకున్నారు.

కుల గణన పేరుతో బీసీలను తగ్గించేందుకు కుట్ర

● ఉపాధ్యాయుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోన్న కాంగ్రెస్ సర్కార్
● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పక్కన అభివాదం చేస్తున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, పాల్గొన్న తపస్ నాయకులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కుల గణన పేరుతో 60లక్షలమంది బీసీలను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. కరీంనగర్‌లో తపస్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ ఫిరాయించిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడటం తథ్యమన్నారు. పదిసీట్లలో ఉపఎన్నికలువస్తే ఏడింటిలో బీజేపీ గెలువడం ఖాయమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందేనని విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలల్లో అసమ్మతి రగులుతోందని, కొందరు రహస్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. హిందూజాతిలో ముస్లింలను ఎలా కలుపుతారని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముస్లింలకు నాలుగుశాతం ఇస్తేనే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలు గెలువాల్సిన స్థానాల్లో ఎంఐఎం గెలిచిందన్నారు. పదిశాతం ఇస్తేపరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యోగ, ఉపాధ్యాయులు జీతాలకోసం అడుక్కునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీతం నుంచి దాచుకున్న జీపీఎఫ్ సొమ్మునుకూడా ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తోందని విమర్శించారు. పీఆర్సీ సహా ఏ సమస్యనూ పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వం ఇదన్నారు. డీఏలు, జీపీఎఫ్, మెడికల్ గ్రాట్యుటి పేరిట ఉద్యోగులకు ప్రభుత్వం రూ. 8,200 కోట్ల బకాయి ఉన్నదన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ కోసం రూ.11వేల కోట్లుచెల్లించలేని దుస్థితి ప్రభుత్వాని దన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల కోసం పోరాటం చేసింది బీజేపీ మాత్రమే అన్నారు. సమావేశంలో టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, తపస్ నాయకులు పాల్గొన్నారు.

రాజన్న హుండీల లెక్కింపు

● 15 రోజులకు రూ.1.69 కోట్ల నగదు
● 116 గ్రాముల బంగారం, 9.80 కిలోల వెండి



డబ్బులను లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిహుండీలను బుధవారం లెక్కించారు. ఆలయ ఆవరణలోని ఓపెన్‌స్లాబ్‌లో ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీలను విప్పి లెక్కించారు. 15రోజుల హుండీలను లెక్కించగా రాజన్న ఖజానాకు రూ. కోటి 69లక్షల 76వేల867 నగదు, 116 గ్రాముల బంగారం, 9కిలోల 800గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపులో ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, ఎస్పీఎఫ్ సిబ్బంది, హోమ్‌గార్డ్స్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. హుండీ లెక్కింపులో శ్రీశివ రామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



విజ్ఞాన భాండాగారం కేంద్ర గ్రంథాలయం

పాఠకులకు అందుబాటులో 76,785 పుస్తకాలు

విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగకరం

దిన, వార, పక్ష, మాస పత్రికలు.. 10,105 సభ్యత్వాలు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేసవి వస్తోంది.. మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో సెలవులొస్తాయి. మధ్యాహ్నం ఎండ సమయంలో తప్ప ఉదయం, సాయంత్రం వేళల్లో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా విద్యార్థులు జ్ఞాన సమపార్జనకు మంచి పుస్తకాలు చదవాలి. ఇందుకోసం సమీపంలోని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి. సెలవుల్లో విద్యార్థులతోపాటు పోటీ పరీక్షల అభ్యర్థులు, పాఠకులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.ఈ నేపథ్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం, అనుబంధంగా పిల్లల గ్రంథాలయంతో పాటు 11 మండలాల్లో ఉన్న గ్రంథాలయాల్లో సభ్యత్వం పొందడం, పుస్తకాల వివరాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

పుస్తకాలు.. సభ్యులు..

జిల్లా పరిధిలో కేంద్ర గ్రంథాలయం, అందులోని చిల్డ్రన్ లైబ్రరీ, 11 మండలాల్లో కలిపి వివిధ భాషలకు చెందిన 2 లక్షల 8 వేల 399 పుస్తకాలు, ఒక్క కేంద్ర గ్రంథాలయంలో 76,785 పుస్తకాలతో పాటు దిన, వార, పక్ష, మాస పత్రికలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్రంలోనే 10,105 మంది సభ్యులుండగా 11 మండలాల్లో 5 వేల 939 మంది సభ్యులున్నారు.

సభ్యత్వం పొందడం ఇలా

ఏప్రిల్ 2024 నుంచి సభ్యత్వ రుసుము 300 రూపాయలు చేశారు. ఆ రుసుము చెల్లించి, ఆధార్ కార్డ్ జిరాక్స్ ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో అందజేస్తే జీవితకాల సభ్యత్వం పొందవచ్చు. డిజిటల్ సభ్యత్వ గుర్తింపు కార్డు కూడా ఇస్తారు. తమకు కావాల్సిన పుస్తకాలను ఇంట్లో కూడా చదువుకొని రెండు వారాల గడువులో తిరిగి గ్రంథాలయంలో అప్పగించాల్సి ఉంటుంది. పోటీ పరీక్షల పుస్తకాలు, 6 నుంచి డిగ్రీ స్థాయి వరకు పుస్తకాలు, గైడ్లను గ్రంథాలయంలోనే చదువుకోవాల్సి ఉంటుంది. ఆయా మండలాల్లో అక్కడే సభ్యత్వం పొందవచ్చు.

సమయాలు

జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ప్రతి శుక్రవారం, ప్రభుత్వ సెలవు దినాల్లో లైబ్రరీ సేవలుండవు. స్టడీ అవర్స్ మాత్రం ప్రతి రోజు 24 గంటల పాటు నిర్వహిస్తారు. మండలాల్లోని గ్రంథాలయాలు ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయి.

కేంద్ర గ్రంథాలయంలో అన్ని సౌకర్యాలు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. సభ్యత్వ నమోదు, మౌలిక వసతుల కల్పన, విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, పాఠకుల ప్రయోజనం కోసం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కార్యదర్శి సరితతో పాటు సిబ్బంది ప్రత్యేక చొరవ కనబరుస్తున్నారు. పోటీ పరీక్షల అభ్యర్థుల రిలాక్స్ కోసం ప్రతి రోజూ చైర్మన్ తన సొంత ఖర్చులతో తేనీరు అందిస్తున్నారు. సభ్యులకు డిజిటల్ కార్డులను మంజూరు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్తగా వస్తున్న పుస్తకాలను తెప్పిస్తున్నారు. డీసీఎల్‌లో ఇంటర్‌నెట్, వైఫై సదుపాయం ఉంది. ఒక నెలలో డీసీఎల్‌లో ఉన్న పుస్తకాల పేర్లు, సంఖ్య వివరాలు బార్‌కోడ్‌తో సహ డాటాలో ఎంట్రీ చేయనున్నారు. మెంబర్‌షిప్ కార్డులను కూడా సిస్టంలో డిజిటలైజేషన్ పూర్తి చేస్తున్నారు.



కరీంనగర్ గ్రంథాలయ ముఖ ద్వారం

మహాశివరాత్రి జాతరకు ముమ్మర ఏర్పాట్లు

● ఆలయ ఆవరణలో వేగంగా జరుగుతున్న పనులు
● ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు



ఆలయ గుడి చెరువులో శివార్చన వేదిక వద్ద ఏర్పాట్లను చేస్తున్న సిబ్బంది, (ఇన్‌సెట్లో) ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్న సూచికలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మరోనాలుగు రోజులు మాత్రమే మిగిలివుండటంతో జాతరఏర్పాట్లను అధికారులు వేగవంతంగా చేస్తున్నారు. రాజన్న ఆలయానికి మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని సుమారు నాలుగులక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ గడిచెరువులో భక్తులను అలరించేందుకు సుమారు 800మంది కళాకారులతో ప్రదర్శన నిర్వహించేందుకు శివార్చన వేదికను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు వీక్షించేందుకు చలువ పందిళ్లను భారీగా ఏర్పాటుచేసి ఎక్కడ కూడా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్స్, పోలీస్‌సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నారు. రాజన్నఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, డీఈ రఘునందన్‌లు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వాహనాల్లో జాతరకు వచ్చేభక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పట్టణశివారు నుంచి వీఐపీ, వీవీఐపీ పార్కింగ్ స్థలం గుర్తించేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తూ, పట్టణ మ్యూమ్యాప్‌నుసైతం ఫ్లెక్సీల రూపంలో భక్తులకుఅందుబాటులోకి తీసుకవస్తున్నారు. ప్రధానకూడళ్లవద్ద ఫ్లెక్సీలుఏర్పాటు చేయడంతో భక్తులు సులువుగా పార్కింగ్‌స్థలాలకు చేరుకునేలా సిద్ధం చేస్తున్నారు. రాజన్న ఆలయంలోని గోపురాలకు, విద్యుత్ దీపాలు, పార్కింగ్ ఏరియా, సైన్‌బోర్డ్స్‌ఏర్పాటు చేస్తున్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

●చంద్రశేఖర్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

●**ఆంధ్ర జ్యోతి:** తాగునీటి సమస్య లేకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు?

●**ఏఈ:** గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. నీటి సమస్య నెలకొనే గ్రామాల వివరాలు సేకరిస్తున్నాం. అనంతరం ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం.

●**ఆంధ్రజ్యోతి:** మిషన్ భగీరథ నీరు పూర్తి స్థాయిలో సరఫరా చేస్తున్నారా?

●**ఏఈ:** మండలంలోని అన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. లీకేజీ అవుతున్న ప్రాంతాల్లో గ్రామపంచాయతీ సిబ్బందితో ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నాం.

●**ఆంధ్రజ్యోతి:** చేతి పంపులను మరమ్మతు చేస్తున్నారా?

●**ఏఈ:** 19గ్రామాల్లో 70 చేతిపంపులు ఉండగా కొన్నింటిని మాత్రమే ప్రజలు వాడుతున్నారు. ఎక్కడైనా చేతిపంపులు రిపేర్ వస్తే మరమ్మతులు చేయిస్తున్నాం. బోర్లను అద్దెకు తీసుకుని తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడానికి అధికారులు అనుమతి ఇచ్చారు.

-కథలాపూర్

నరసింహ స్వామి ఆలయంలో భక్తుల సందడి

బీర్‌పూర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ లక్ష్మీనసింహస్వామి ఆలయంలో బుధవారం భక్తుల సందడి నెలకొంది. ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి గుట్టకింద జాతర జరుగు ప్రాంతం సమీపంలో వంట లు చేసుకుని భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి సంకటాల శ్రీనివాస్, ఆలయ మాజీ చైర్మన్‌లు సామ్రాట్, సుమన్, అర్చకులు సంతోష్, మంధు కుమార్, సంతోష్ కుమార్, ఆలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని పురాణిపేట శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర, సహిత దత్తాత్రేయ సహిత షోడశ 16వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉదయం శివ కల్యాణం, మధ్యాహ్నం అన్న ప్రసాదం, సాయంత్రం సుంకు కార్య క్రమం, ప్రభల కార్యక్రమం తదితర కార్యక్ర మాలను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మాలలో మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, నలమసు గంగాధర్, చెట్ల జానకి రవి, సిరిపురం నవీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



కోరుట్లలో శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాదగిరి



బండలింగాపూర్‌లో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా బుధవారం జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి వద్ద గల శివాజీ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ బోగ శ్రావణి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మరో కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు పట్టణంలోని శివాజీ చౌక్ గీతాలయం వద్ద గల విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, ఆముద రాజు, దశరథ్ రెడ్డి, సాంబారి కళావతి, జ్యోతి రెడ్డి, రాజేందర్, ఏసీఎస్ రాజు పాల్గొన్నారు.

●**జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామంలో శివాజీ విగ్రహానికి జగిత్యాల ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, కమలాకర్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, లింగారెడ్డి, యూత్ సభ్యులు నరేష్‌గౌడ్, హర్షిత్‌రావు, రాజేష్, అజయ్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, ప్రశాంత్, విజయ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని పలు ప్రాంతాల్లో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైందవ మత వ్యాప్తికి శివాజీ కృషి చేశారని జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాదగిరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** మండలంలోని బండలింగాపూర్, రామలచ్చక్కపేట గ్రామాల్లో ఛత్రపతి శివాజీ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహాలకు బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి, వెల్లుల్లలో మాజీ ఎంపీపీ తొగిటి అంజయ్య నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు జంగిటి శ్రీధర్, మారు జనార్ధన్‌రెడ్డి, కొసగంటి మహేష్, ఎలేటి శ్రీనివాస్, ఇట్టేడి గంగారెడ్డి పాల్గొన్నారు.

●మండలంలోని సత్యక్కపల్లె గ్రామ శివారులోని జాతీయ రహదారి ప్రధాన కూడలి వద్ద శివాజీ విగ్రహ నిర్మాణానికి యువకులు భూమిపూజ చేశారు. ప్రధాన కూడలికి శివాజీ చౌక్‌గా నామకరణం చేశారు.

●**ధర్మపురి:** ధర్మపురి పట్టణంలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చింతామణి చెరువు వద్ద హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అంతకు ముందు పలువురు ప్రజా ప్రతినిధులు, బీజేపీ, బీజేవైఎం, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీ నేతలు, యువకులు కలిసి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. పెద్దనక్కలపేట గ్రామంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ ఐక్య వేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** మండలంలో శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ యువసేన సభ్యుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శివాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు రాజశేఖర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, కమలాకర్, మహేందర్, అరుణ్, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

●**రాయికల్:** రాయికల్ పట్టణంలో శివాజీ యువజన సంఘం, సంఘమిత్ర యూత్‌తో పాటు మండలంలోని మూటపెల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో, రామాజీపేట, భూపతిపూర్, కొత్తపేట, అల్లీపూర్, ఆలూరు తదితర గ్రామాల్లో శివాజీ విగ్రహాలకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు, మండల ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి రాజశేఖర్, నాయకులు గోనె నరేష్, అర్గుల రాజేందర్, మనోజ్ పాల్గొన్నారు.

●మండలంలోని అల్లీపూర్‌లో రైడర్స్ యూత్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రైడర్స్ యూత్ అధ్యక్షుడు ఎర్రవేణి రవి, అంగడి పరమేశ్వర్, డాక్టర్ వెంకటేశం, మధు పాల్గొన్నారు.

●రాయికల్ పట్టణంలోని శివాజీ విగ్రహం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎనగందు రమేష్, తురగ శ్రీధర్ రెడ్డి, లింగ శ్రీనివాస్, మ్యాకల రమేష్, కొయ్యడి మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలో హిందు సంఘాల నాయకులు శివాజీ విగ్రహానికి పూల మాలలు వేశారు. యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ పార్టీల నాయకులు జీవన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రాజేందర్, నర్సింహరెడ్డి, వెంకటేష్‌గౌడ్, నర్సయ్య, అజయ్, నరేష్, రాజేశం, తిరుపతిరెడ్డి, కార్తిక్, రాకేష్ ఉన్నారు.

●**మల్యాల:** ముత్యంపేట, తాటిపల్లి, మల్యాల, లంబాడిపల్లి, మ్యాడంపల్లి, మద్దుట్ల తదితర గ్రామాల్లో శివాజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. నూకపల్లిలో శివాజీ విగ్రహం ఆవిష్కరించారు. యువకులు గ్రామాల్లో శోభయాత్ర నిర్వహించారు.

●**ఎండపల్లి:** మండలంలోని మారేడుపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించారు. ముంజంపల్లి, ఉండెడా గ్రామాలలో బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. గుల్లకోట గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము జెలెందర్ యాదవ్ శివాజీ అభిమానులు పాల్గొన్నారు.

●**కథలాపూర్:** హైందవ సంస్కృతికి శివాజీ మహరాజ్ ఉన్నత స్థానం కల్పించారని బీజేపీ జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పోసానిపేటలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. అనంతరం కథలాపూర్ మండల కేంద్రంలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, ఎంజీ రెడ్డి, అనిల్‌రెడ్డి, గాంధారి శ్రీనివాస్, కథలాపూర్ మహేశ్ పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, యువకులు పాల్గొన్నారు.

●**బీర్‌పూర్:** మండలకేంద్రం నుంచి యువకులు బైక్ ర్యాలీగా వెళ్లి మండలంలోని మంగేళ, కండ్లపెల్లి, కమ్మునూర్ గ్రామాలలోని శివాజీ విగ్రహాలకు నివాళులర్పించారు. తుంగూర్ గ్రామంలోని శివాజీ విగ్రహానికి నివాళులు అర్పించి స్వీట్లు పంపిణీ చేశారు.

●**గొల్లపల్లి:** మండల కేంద్రంతో పాటు శ్రీరాముల పల్లె, చిల్వాకోడూర్, తదితర గ్రామాల్లో శివాజీ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



ధర్మపురిలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ



మల్యాలలో వేడుకల్లో పాల్గొన్న యువకులు

నెరవేరిన కల

(5వ పేజీ తరువాయి)

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే సమయంలో మళ్లీ వీరంతా తిరిగి రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నియామకం పొందిన కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు సంబంధిత ఎంఈవో కార్యాలయాల్లో రిపోర్టు చేసి, అగ్రిమెంట్ బాండ్లను అందించి విధుల్లో చేరారు. కాగా పదహారేళ్ల తర్వాత పాఠాలు బోధించేందుకు బడి బాట పట్టడంతో వారిలో ఆనందం వ్యక్తం అవుతోంది.

సంతోషంగా ఉంది

-శివకుమార్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, భీమారం



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2008 డీఎస్సీలో ర్యాంకు సాధించా. అయితే మాకు వివిధ కారణాలతో అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీలు ఇవ్వలేదు. దాదాపు 16 సంవత్సరాల తర్వాత ఉద్యోగం లభించడం సంతోషంగా ఉంది. నాకు భీమారం మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలను కేటాయించారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

-జక్కోజు జయ, ఎంపీపీఎస్, లొత్తునూరు



కుమ్మరిపల్లిలో 2011 సంవత్సరం నుంచి మ్యాథ్స్ సీఆర్‌టీగా పనిచేశాను. ఇన్ని సంవత్సరాల తర్వాత డీఎస్సీ 2008పై ప్రభుత్వం స్పందించడం సంతోషంగా ఉంది. నాకు లొత్తునూరు ఎంపీపీఎస్‌లో కాంట్రాక్టు టీచరుగా అవకాశం కల్పించారు.

రెగ్యులర్ ఇస్తే బాగుండేది

-బొమ్మగాని ప్రభాకర్, ఎంపీపీఎస్, బీరుసాని



డీఎస్సీ-2008 అభ్యర్థులకు ప్రభుత్వం కాంట్రాక్టు ప్రతిపాదికన ఉద్యోగ అవకాశం కల్పించింది. రెగ్యులర్ ఉద్యోగం ఇస్తే ఇంకా బాగుండేది. ఎట్టకేలకు ప్రభుత్వ పాఠశాలలో టీచరుగా ఉద్యోగానికి ఎంపికై పనిచేయడం ఆనందాన్ని కలిగిస్తోంది. నన్ను బీరుసాని ఎంపీపీఎస్‌లో కాంట్రాక్టు టీచరుగా నియమించారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

కొడిమ్యాల, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్.శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న రాష్ట్ర లెప్రసీ నివారణ ప్రత్యేక బృందం మండలానికి వస్తున్న సందర్భంగా లెప్రసీ వ్యాధిగ్రస్తులకు శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల మెడికల్ ఆఫీసర్ పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, వెంకటనర్సమ్మ, హెల్త్ అసిస్టెంట్లు ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు'

మెట్‌పల్లి రూరల్, ఫ్రిబవరి, 19 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, ముల్క కొమురయ్య గెలవడం ఖాయమని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. బుధవారం బండలింగాపూర్ గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పచ్చీస్ ప్రబావరి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు మారు జనార్ధన్‌రెడ్డి, జంగిటి శ్రీధర్, కొసగంటి మహేష్‌చారి పాల్గొన్నారు.

●ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని జగిత్యాల బీజేపీ నాయకురాలు బోగ శ్రావణి కోరారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షులు బాయి లింగారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

కొడిమ్యాల, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు సాధ్యమని పోస్టల్ అధికారులు అన్నారు. మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్‌లో పోస్ట్ మ్యాన్ బైరి సత్యనారాయణ బుధవారం పదవీ విరమణ పొందారు. సత్యనారాయణను జగిత్యాల ఈస్ట్ సబ్ డివిజన్ ఏఎస్‌పీ కిరణ్‌రెడ్డి, ఎస్‌పీఎం రాజగంగారాం, ఎంవో శ్రీనివాస్, పీఏ కార్తిక్ ఘనంగా సన్మానం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

-రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్



మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణరావులు కోరారు. బుధవారం పట్టణంలోని జువ్వాడి భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నోటిఫికేషన్‌లు వేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారనికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, యూత్ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, పోనకంటి చిన్న వెంకట్, ఆవేజ్, కొంతం రాజు, విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

వెల్గటూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు, ఉద్యోగులకు అండగా నిలుస్తోందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో పట్టభద్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ నెల 21న ధర్మపురిలో మంత్రి శ్రీధర్‌బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

●పెగడపల్లి: ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం పెగడపల్లి మండలంలోని బతికెపల్లిలో పార్టీ నాయకులతో ప్రచారం నిర్వహించారు.

●గొల్లపల్లి: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం భవనంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు.

కాంగ్రెస్ సత్తా చాటాలి

కొడిమ్యాల, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా కొడిమ్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి ఊటుకూరి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కోరారు. బుధవారం మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో మండలంలోని కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.

ఆర్థిక సహాయం

గొల్లపల్లి, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండ లంలోని మల్లన్నపేట గ్రామంలో నిరుపేద దంపతులు వజ్రవ్వ-వెంకన్న కూతురు రాజ మణి వివాహ ఖర్చుల నిమిత్తం బీఆర్ఎస్వీ మండల శాఖ అధ్య క్షుడు ఆవారి చందు రూ.5వేల ఆర్థికసాయం అందించి బుధ వారం అండగా నిలిచాడు. ఈసందర్భంగా నిరుపేద యువ తి రాజమణి వివాహానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన దాత ఆవారి చందును పలువురు గ్రామస్థులు అభినందించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. బండలింపూర్ గ్రామ శివారులోని గండి హన్మన్ ఆలయం వద్ద పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఆయన పరిశీలించారు. ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీని ఆపి అనుమతి పత్రాలను పరిశీలించారు. అనుమతి ఉండటంతో లారీని వదిలేశారు. రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని సీఐ పేర్కొన్నారు. ఇసుక అక్రమ రహణను అరికట్టెందుకు చెక్‌పోస్ట్ వద్ద 24 గంటల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

కోరుట్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు భారతీయ కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ బహుమతులను ప్రదానం చేసింది. ప్రాచీన మరుగున పడిన ఆటలను ప్రోత్సహించడానికిగాను విద్యార్థినులచే కబడ్డీ, ఖోఖో, గిర్లు దండ, అగోర్, చార్‌పల్లి, కైలాసం, పులిమేక వంటి ఆటలను ఆడించి వీడియో మంత్రిత్వ శాఖకు ఉపాధ్యాయులు పంపించారు.

కబడ్డీ ఆటకు ఎక్కువ లైక్‌లు రావడంతో ప్రథమ బహుమతికి ఎంపికైంది. దీంతో ఇండియన్ నాలెడ్జ్ సెంటర్ 14 మంది విద్యార్థినులకు పోస్ట్ ద్వారా బహుమతులు పంపించిందని ప్రధానోపాధ్యాయులు సిహెచ్ కృష్ణమోహన్ రావు తెలిపారు.

నిరుపయోగంగా తాగు నీటి పథకాలు



పిచ్చి మొక్కలతో తాటిపల్లి సీపీడబ్ల్యూఎస్ ఫిల్టర్‌బెడ్‌లు

మల్యాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మిషన్‌భగీరథ రాకతో నీటి పథకాలు మూలన పడ్డాయి. ఇంటింటికీ తాగునీరందించడానికి చేపట్టిప మిషన్‌భగీరథ పూర్తి స్థాయిలో నీరందించకపోగా కోట్లాది రూపాయాల నీటి పథకాలు మాత్రం నిరూపయోగంగా మారాయి. నీటి పథకాలు పనిచేయకపోవడంతో నేటికి పలు గ్రామాల్లో ప్రజలు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. మల్యాల, కొడిమ్యాల మండలాలలోని పలు గ్రామాలకు రక్షిత తాగునీరందించే తాటిపెల్లి తాటిపెల్లి సీపీడబ్ల్యూఎస్ మిషన్ భగీరథ రాకతో నాలుగేళ్ల క్రితం మూలన పడింది. దీని కింద ఆయా మండలాల పరిధి లోని గ్రామాలకు గతంలో నిత్యం నీటి సరఫరా జరుగుతుండేది. అయితే అది నిలిచిపోవడంతో నీటి సరఫరా సరిగా కావడం లేదని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

●కొండగట్టు పుణ్యక్షేత్రంకు నీరందించడానికి దాదాపు 7కి.మీ దూరంతో తాటిపెల్లి శివారులోనే మరొకటి కొండగట్టు సీపీడబ్ల్యూఎస్ ఏర్పాటు చేశారు. అది ఏనాడు పూర్తిగా పని చేయకపోగా తరచూ పైపులు పగలడంతో మున్నాళ్లకే మూలన పడింది. దీంతో దాదాపు రూ.2కోట్ల వరకు దేవస్థానం నష్టపోయినట్లు అయింది.

గ్రామాల్లోని స్థానిక నీటి పథకాలను మినహాయిస్తే తాటిపెల్లి, కొండగట్టు సీపీడబ్ల్యూఎస్ పథకాలతో దాదాపు రూ 5కోట్లు నీటి పాలు అయ్యాయి. ఈ పథకాలను ప్రత్యామ్నాయంగా వినియోగించుకోవాల్సిన చర్యలపై ఆలోచించాలని పలువురు ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

'నేతకాని కులస్థుల జోలికి వస్తే ఊరుకోం'

ధర్మపురి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నేతకాని కులస్థుల జోలికి వస్తే ఖబడ్దార్ అంటూ చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని నేతకాని సంఘం జిల్లా అధ్యక్షులు దుర్గం రవీందర్ హెచ్చరించారు. ధర్మపురి పట్టణంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేతకాని జాతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్‌నేతను విమర్శించే స్థాయి నీది కాదని ఆయన అన్నారు. మా సంఘం నుండి కొందరితో మాపైనే ఉసి గొలిపే ప్రయత్నం చేస్తున్నారని, త్వరలో వారికి బుద్ధి చెపుతామని ఆయన అన్నారు. వివేక్ వెంటకస్వామి కార్పొరేషన్ అంటూ ఒకే గ్రూపులో రెండు కార్పొరేషన్లు ఇవ్వరు అని తెలుసునని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో నేతకాని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర్, ధర్మపురి మండల ఇంచార్జ్ శ్రీనివాస్, ధర్మారం, ఎండపల్లి, వెలగటూర్ మండలాల అధ్యక్షులు మల్లేష్, కేశవయ్య, సత్యనారాయణ, ధర్మారం మండల కార్యదర్శి

ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

వెల్గటూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివాణకు ఏడవ నంబరు రాష్ట్ర రహదారిపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఏడవ నంబరు రాష్ట్ర రహదారిపై, రాజారాంపల్లి నుంచి జగిత్యాల వెళ్లే రహదారిపై ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న ప్రదేశంలో వాహనదారులను అప్రమత్తం చేయడానికి బుధవారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గతంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగిన ప్రదేశాలను గుర్తించి ఆ ప్రదేశాలలో ప్రమాదాలు జరుగకుండా ఉండడానికి తగు హెచ్చరిక బోర్డులను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అమర్చడం జరిగిందన్నారు. ద్వి చక్ర వాహనదారులు రోడ్డుపై తమ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉమాసాగర్, కానిస్టేబుల్ ఆదిల్ , రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు

కొడిమ్యాల, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులకు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. యువకులు వేములవాడ వైపు నుంచి కొడిమ్యాల వైపు బైక్‌పై వెళ్తుండగా నల్లగొండ గ్రామ శివారులో ఆగి ఉన్న కారును ఢీకొట్టగా గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను 108 వాహనంలో జగిత్యాల ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయమై ఎస్సై సందీప్‌ను వివరణ కోరగా ప్రమాదం జరిగింది వాస్తవమేనని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

రాయికల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 11వ యూత్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని కట్కాపూర్ గ్రామానికి చెందిన మాదం వర్ష ప్రతిభ కనబరిచింది. అండర్-16 లాంగ్ జంప్‌లో ద్వితీయ బహుమతి గెలుపొందింది. ఈ సందర్భంగా విద్యార్థిని జగిత్యాల జిల్లా స్పోర్ట్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్యం రెడ్డి, శ్రీలత, మహేష్ తదితరులు అభినందించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరులో బుధవారం పునుగోటి మదన్‌మోహన్ రావుకు చెందిన గేదె విద్యుదాఘాతంతో మృతిచెందింది. రోజు మాదిరిగానే గేదె మేతకు వెళ్ళగా దాహం వేయడంతో నీరు తాగేందుకు వెళ్తున్న క్రమంలో విద్యుదాఘాతంకు గురై అక్కడిక్కడే మృతి చెందింది. రైతుకు రూ.80 వేల నష్టం వాటిల్లిందని మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాడుతా

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే శాసన మండలిలో ప్రజల పక్షాన పోరాడుతానని ధర్మ సమాజ్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి మంద జ్యోతి పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ కన్వీనర్ దుబ్బాక శివతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.